# ఐఫోన్ ధర వాచిపోద్ది

**యాపిల్‌కు 'మేక్ ఇన్ యూఎస్' కష్టాలు • అమెరికాలోనే ఉత్పత్తి చేయాలని ట్రంప్ ఒత్తిడి**
**ధర మూడింతలవుతుందన్న అంచనాలు • భారత్‌సహా ఆసియా దేశాల్లోనే చౌకగా తయారీ**



న్యూఢిల్లీ, మే 16: టెక్నాలజీ దిగ్గజం యాపిల్‌ను అమెరికాకు తెచ్చేందుకు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నం చాలాచాలా ఖరీదైనదిగానే కనిపిస్తున్నది. అవును మరి.. ట్రంప్ పుణ్యమాని యాపిల్‌కు 'మేక్ ఇన్ యూఎస్' కష్టాలు వచ్చిపడ్డాయిప్పుడు. భౌగోళిక, రాజకీయ వ్యూహాల దృష్ట్యా చైనా నుంచి భారత్‌కు తమ తయారీని మార్చాలనుకున్న అమెరికన్ కంపెనీ యాపిల్‌కు ట్రంప్ రూపంలో ప్రధాన అవరోధం ఏర్పడుతున్నది. అమెరికా సంస్థలు స్థానిక ఉత్పాదకతకే ప్రాధాన్యం ఇవ్వాలంటూ అక్కడి కార్పొరేట్లపై గత కొద్ది రోజులుగా ప్రెసిడెంట్ ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో యాపిల్ తల పట్టుకుంటున్నది.

### ఇదీ సంగతి..


యాపిల్ ఉత్పత్తులు ప్రస్తుతం 80 శాతం చైనాలోనే తయారవుతున్నాయి. దీనివల్ల అక్కడ దాదాపు 50 లక్షల మందికి ఉద్యోగ-ఉపాధి అవకాశాలూ లభిస్తున్నాయి. అయితే గత కొన్నేండ్లుగా చైనా పరిస్థితులు తమకు ప్రతికూలంగా మారుతున్నాయని భావిస్తున్న కంపెనీలు.. ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలోనే భారత్‌పై యాపిల్ దృష్టి సారించింది. అయితే గతంతో పోల్చితే ఇప్పుడు మారిన అమెరికా అవసరాలు, ప్రాధాన్యాలు, లక్ష్యాల వల్ల యాపిల్ స్వదేశానికే రావాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. గురువారం ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్‌తో జరిగిన సంభాషణల్లోనూ ట్రంప్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. భారత్‌లో విస్తరణ ఆలోచనల్ని మానుకోవాలని కుక్‌కు ట్రంప్ సూచించారు. కానీ ఇది యాపిల్‌కు ఏమాత్రం ఇష్టం లేకుండా ఉన్నది. ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గితే భీకర నష్టాలు తప్పేలా లేవు.

### ధరలు కొండెక్కుతాయ్

యాపిల్ ఉత్పత్తుల్లో ప్రధానమైనది ఐఫోన్. ఇటీవలికాలంలో ఐఫోన్ అమ్మకాలు బాగా పెరుగుతూపోతుండగా, ఆసియా దేశాల్లోనైతే వీటి వినియోగం విపరీతంగా పెరిగిందనే చెప్పాలి. దీంతో ఇన్నాళ్లూ మార్కెట్ లీడర్లుగా ఉన్న సామ్‌సంగ్ తదితర సంస్థలకు యాపిల్ గట్టి పోటీనిస్తున్నదిప్పుడు. అయితే యాపిల్ తమ ఉత్పత్తిని అమెరికా ప్రధాన కేంద్రంగా నడిపిస్తే.. ఐఫోన్ ధరలు పెరగడం ఖాయమన్న అంచనాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వెయ్యి డాలర్లుగా ఉన్నది.. 3వేల డాలర్లకు చేరవచ్చని అంటున్నారు. భారతీయ కరెన్సీలో ఐఫోన్ రేటు రూ.85,000 నుంచి ఏకంగా రూ.2.55 లక్షలకు చేరుతుంది. ఇదే జరిగితే యాపిల్ అమ్మకాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. భారత్, చైనా, వియత్నాం వంటి ఆసియా దేశాలతో పోల్చితే అమెరికాలో ఉత్పాదక వ్యయం చాలాచాలా ఎక్కువ. ఉద్యోగుల జీతాలు, ప్లాంట్ల నిర్వహణ ఖర్చులు, ముడి సరకు వ్యయం వంటివి అన్నీ పెరిగిపోతాయని ఎంసీసీఐఏ డైరెక్టర్ జనరల్ ప్రశాంత్ గిర్బనే అంటున్నారు. ఒకవేళ ట్రంప్ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇచ్చినా ఉత్పాదకత భారమేనన్న అభిప్రాయాలున్నాయి. అందుకే ట్రంప్ ప్రతిపాదనపై యాపిల్ అయిష్టంగానే ఉన్నది. టిమ్ కుక్ సైతం భారత్‌లో తమ నెట్‌వర్క్ విస్తరణ ఉంటుందనే చెప్తుండటం గమనార్హం.

## డిపాజిట్లపై ఎస్బీఐ వడ్డీరేట్ల తగ్గింపు

• **20 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్**



న్యూఢిల్లీ, మే 16: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) మరోసారి డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించింది. ప్రత్యేక 444 రోజుల డిపాజిట్ స్కీంతోపాటు అన్ని రకాల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. తగ్గించిన వడ్డీరేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటు 7.05 శాతం నుంచి 6.85 శాతానికి దిగొచ్చింది. ఫిబ్రవరిలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం తర్వాత ఎస్బీఐ డిపాజిట్లపై వడ్డీరేట్లలో కోత విధించడం ఇది రెండోసారి. దీంతో గడిచిన మూడు నెలల్లో డిపాజిట్లపై వడ్డీరేట్లను అర శాతం తగ్గించినట్లు అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వడ్డీరేట్లు మరో రెండు-మూడుసార్లు తగ్గించే అవకాశాలున్నాయి. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు ఈ నూతన రేట్లు వర్తించనున్నాయి.

## కార్వీ ఇన్వెస్టర్లు క్లెయిం చేసుకోండి..







న్యూఢిల్లీ, మే 16: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్‌కు చెందిన పెట్టుబడిదారులు వచ్చే నెల 2 లోగా తమ క్లెయిమ్‌లను దాఖలు చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సూచించింది. నవంబర్ 23, 2020న కార్వీ స్టాక్ బ్రోకింగ్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఉద్దేశ పూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో కార్వీలో పెట్టుబడులు పెట్టిన వారు తమ పెట్టుబడులకు సంబంధించి క్లెయిమ్‌ల చివరి తేదీ జూన్ 2గా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సెబీ ఒక ప్రకటనను విడుదల చేసింది. పెట్టుబడిదారులు టోల్-ఫ్రీ నంబర్ 1800 2660050 లేదా defaultisc@nse.co.in కి ఈ-మెయిల్ చేయాలని సూచించింది. క్లయింట్లకు సంబంధించి పెట్టుబడులను దుర్వినియోగం చేసిన కేసులో కేఎస్‌బీఎల్, కంపెనీ సీఎండీ సీ పార్థసారథిపై ఏడేండ్లపాటు నిషేధం విధించడంతోపాటు రూ.21 కోట్ల జరిమానా విధించిన విషయం తెలిసిందే. కేఎస్‌బీఎల్‌కు సంబంధించిన ఆస్తులను జప్తు చేసి, విక్రయించడంతో వచ్చిన నిధులను పెట్టుబడిదారులకు పంచనున్నది. కేఎస్‌బీఎల్ సంస్థ ప్రమోటర్లు తమకు నచ్చినట్టు వ్యవహరించారని, ముఖ్యంగా క్లయింట్ల సెక్యూరిటీలను తాకట్టుపెట్టి పలు సంస్థల వద్ద రుణాలు తీసుకున్నారని, వీటిపై క్లయింట్లకు తెలియనీయకుండా వ్యవహరించారని సెబీ ఆరోపించింది.


## భారత్‌కు వొడాఫోన్ గుడ్‌బై!

**ఏజీఆర్ బకాయిలపై ప్రభుత్వం సహాయం అందించకుంటే అంతే**

న్యూఢిల్లీ, మే 16: టెలికాం సేవల సంస్థ వొడాఫోన్ ఐడియా..భారత్‌కు గుడ్‌బై చెప్పేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఏజీఆర్‌పై ప్రభుత్వం సకాలంలో స్పందించకపోతే వచ్చే ఏడాది నుంచి టెలికం సేవలు అందించలేమని స్పష్టంచేసింది. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకోవడం కష్టతరమవుతున్నదని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏజీఆర్ బకాయిలపై స్పష్టతనివ్వాలని, లేకపోతే టెలికం సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్టు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ సీఈవో అక్షయ ముంద్రా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ సపోర్ట్ లేకుండా టెలికాం సేవలు అందించలేమని, ముఖ్యంగా సర్దుబాటు స్థూల ఆదాయం(ఏజీఆర్) విధించిన రూ.30 వేల కోట్లను మాఫీ చేయాలని కేంద్రాన్ని కోరుతున్నది. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే వచ్చే ఏడాది నుంచి టెలికాం సేవలు అందించలేమని, ముఖ్యంగా బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి మొగ్గుచూపడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు. రూ.30 వేల కోట్ల ఏజీఆర్‌పై సుప్రీంకోర్టులో సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో విచారణ చేపట్టిన ప్రత్యేక బెంచ్ ఈ కేసు ఈ నెల 19న విచారణకు రానున్నది.

# పడేసిన బ్లూచిప్ షేర్లు

***సెన్సెక్స్ 200, నిఫ్టీ 42 పాయింట్ల పతనం • కుదేలైన సెలెబీ షేరు.. 10 శాతం క్షీణత***



ముంబై, మే 16: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేకులు పడ్డాయి. ఐటీ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతోపాటు బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టాల్లోకి జారుకోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 200.15 పాయింట్లు కోల్పోయి 82,330.59 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన సూచీకి చివర్లో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. మరో సూచీ నిఫ్టీ కూడా 42.30 పాయింట్లు కోల్పోయి 25,019.80 వద్ద నిలిచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా 2.81 శాతం నష్టపోయింది. కంపెనీలో సింగ్‌టెల్ తన వాటాను 1.2 శాతం తగ్గించుకోవడం షేరు పతనానికి ప్రధాన కారణం. దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, లార్సెన్ అండ్ టుబ్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు నష్టపోయాయి. కానీ, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి. సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయని, ఐటీ, బ్యాంకింగ్, మెటల్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం సూచీల పతనానికి కారణమని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సీ తెలిపారు. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.80 శాతం లాభపడగా, దీంతోపాటు రియల్టీ 1.72 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.63 శాతం, యుటిలిటీ 1.44 శాతం, పవర్ 1.37 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఐటీ, టెక్నాలజీ, మెటల్, బ్యాంకింగ్ రంగ సూచీలు నష్టపోయాయి. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 2,876.12 పాయింట్లు లేదా 3.61 శాతం, నిఫ్టీ 1,011.8 పాయింట్లు లేదా 4.21 శాతం చొప్పున పెరిగాయి.

### రక్షణ రంగ షేర్ల జోరు

రక్షణ రంగ షేర్లు కదంతొక్కుతున్నాయి. డ్రోన్ల తయారీసంస్థల షేర్లతోపాటు క్షిపణుల, అనుబంధ రంగాల సంస్థల షేర్లు 19 శాతం వరకు లాభపడ్డాయి. పారస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ షేరు అత్యధికంగా 18.90 శాతం లాభపడగా, డాటా ప్యాటర్న్ 9.25 శాతం, ఆస్ట్రా మైక్రోవేవ్ 7.10 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 5.40 శాతం, మిశ్రా ధాతు నిగామ్ 4.63 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 3.87 శాతం, భారత్ డైనమిక్స్ 1.95 శాతం చొప్పున పెరిగాయి.

## మళ్లీ పెరిగిన బంగారం ధర



బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. దేశవ్యాప్తంగా ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,400 ఎగబాకి రూ.96,450 పలికింది. పసిడితోపాటు వెండి ధరలు రూ.1,000 అధికమై రూ.98 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.97 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా తగ్గినప్పటికీ దేశీయంగా ధరలు పెరగడం విశేషం. ఔన్స్ గోల్డ్ ధర 50.85 డాలర్లు లేదా 1.57 శాతం తగ్గి 3,189.25 డాలర్లకు దిగొచ్చింది.

## రూ.1,300కే విమాన టికెట్


న్యూఢిల్లీ, మే 16: టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మరో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఫ్లాష్ సేల్' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,300గా నిర్ణయించింది. www.airindiaexpress.com లేదా మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నది. ఈ నెల 18 వరకు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 1 నుంచి సెప్టెంబర్ 15 లోగా ప్రయాణించాల్సివుంటుందని పేర్కొంది.

## హైదరాబాద్‌లో బ్యూ4 అవుట్‌లెట్

హైదరాబాద్, మే 16: ఈవీ స్కూటర్ల విక్రయ సంస్థ బ్యూ4.. తాజాగా తెలంగాణ మార్కెట్లోకి అడుగుపెట్టింది. తన తొలి షోరూంను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, చైర్మన్ ఉర్విష్ షా మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి దేశవ్యాప్తంగా 100కి పైగా స్టోర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ స్టార్, షైన్, డొజొ పేర్లతో మూడు రకాల స్కూటర్లను రూ.74,999 నుంచి రూ.1.2 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నాయి.

## ఎగుమతులకు వ్యవసాయం

• **ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ రంగాల్లోనూ దూకుడు**
• **దేశీయ ఎక్స్‌పోర్ట్స్‌లో 50 శాతానికి పైగా ఈ వస్తూత్పత్తులే..**



న్యూఢిల్లీ, మే 16: భారతీయ వాణిజ్య ఎగుమతుల్లో వ్యవసాయం, ఔషధ, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తూత్పత్తుల వాటానే గత ఆర్థిక సంవత్సరం (2024-25) 50 శాతానికిపైగా ఉన్నట్టు తాజాగా విడుదలైన ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన సంవత్సర కాలంలో భారత్ నుంచి మొత్తం 437.42 బిలియన్ డాలర్ల ఎక్స్‌పోర్ట్స్ ఆయా దేశాలకు జరిగాయి. వీటిలో ఇంజినీరింగ్ గూడ్స్ వాటా అత్యధికంగా 26.67 శాతంగా ఉన్నది. వీటి విలువ 116.67 బిలియన్ డాలర్లు. ఆ తర్వాత వ్యవసాయోత్పత్తులు 11.85 శాతం, ఎలక్ట్రానిక్స్ 8.82 శాతం, ఫార్మాస్యూటికల్స్ 6.96 శాతంగా ఉన్నాయి. అయితే వృద్ధిపరంగా 32.46 శాతంతో ఎలక్ట్రానిక్ గూడ్స్ ఉన్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24) 29.12 శాతంగానే ఉన్నది. కంప్యూటర్ హార్డ్‌వేర్ తదితరాలకు డిమాండ్ ఎక్కువగా కనిపించింది. యూఏఈ, అమెరికా, నెదర్లాండ్స్, బ్రిటన్, ఇటలీ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యాయి. అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, బ్రిటన్, జర్మనీ దేశాలకు భారత ఇంజినీరింగ్ గూడ్స్ ఎక్కువగా వెళ్లాయి.

# 'గిరిగిరి'.. పేదోళ్లే గురి!

**ఖమ్మం అర్బన్ పరిధిలో పెరిగిపోతున్న ఫైనాన్స్ దందా**
**గిరిగిరి, వారాల పేరుతో లక్షల్లో దండుకుంటున్న వ్యాపారులు**
**అధిక వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్న పేదలు**
**వ్యాపారుల ఆగడాలపై దృష్టి సారించని అధికారులు**

రఘునాథపాలెం, మే 16 : నిరుపేదల అవసరాలను ఆసరా చేసుకున్న గిరిగిరి వ్యాపారులు అధిక వడ్డీకి డబ్బులు వెదజల్లి.. మళ్లీ రాబట్టుకునేందుకు జలగల్లా పీడిస్తున్నారు. తమ తెలివి తేటలతో అమాయక ప్రజలను నిలువునా దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు ఇచ్చే అప్పులు తీర్చలేక నిరుపేదలు నానా తంటాలు పడుతున్నారు. కొందరు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఖమ్మం అర్బన్ పరిధిలో కోకొల్లలు. వడ్డీ వ్యాపారులు మాత్రం రోజులు, వారాల పేరుతో దోచుకుంటూ దర్జాలు ఒలకబోస్తున్నారు. పేదల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తున్న 'ఫైనాన్స్ జులుం'పై నమస్తే తెలంగాణ కథనం.

ఫైనాన్స్ వ్యాపారం చేయాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. కానీ.. ఖమ్మం అర్బన్ పరిధిలో అనుమతుల్లేకుండానే ప్రైవేటు ఫైనాన్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. గిరిగిరి పేరుతో వ్యాపారులు పేదలకు డబ్బులు ఎరేసి రోజులు, వారాల వాయిదాలతో అధిక వడ్డీ లాగుతున్నారు. ఒక్క రోజు, ఒక్క వారం కట్టలేకపోయినా ఆగిన డబ్బులకు వడ్డీ కట్టి లెక్కిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. మచ్చుకు.. పాండురంగాపురానికి చెందిన షాజహాన్ అనే మహిళ తన కుటుంబ అవసరాల నిమిత్తం ఓ ఫైనాన్స్ వ్యాపారి వద్ద రూ.10 వేలు అప్పు తీసుకుంది. డబ్బులు ఇచ్చే సమయంలో ఆ వ్యాపారి ఓ కార్డును జారీ చేశాడు. అందులో రూ.12 వేలు తీసుకున్నట్లు నమోదు చేశాడు. అంతేకాదు రూ.12 వేలు తీసుకున్నట్లు ఓ ప్రాంసరీ నోటు రాయించుకొని సంతకం కూడా చేయించుకున్నాడు. తీసుకున్న రోజు నుంచి ఓ వారం కేటాయించి వారానికి రూ.వెయ్యి చొప్పున 12 వారాలకు కలిపి రూ.12 వేలు కట్టాలని ఖరాకండీగా తేల్చి చెప్పాడు. అయితే షాజహాన్ అవసరానికి డబ్బులైతే తీసుకుంది కానీ.. వ్యాపారి నిబంధనలకు అనుగుణంగా ప్రతీ వారం కట్టలేక ఇబ్బందులు పడుతూ వచ్చింది. తీరా రెండు వారాలు కట్టలేని పరిస్థితుల్లో వ్యాపారి వచ్చే సమయానికి భయంతో ఇంటికి తాళం వేసి ఉడాయించింది. కానీ.. ఆలస్యమైనా సరే డబ్బులు కట్టాలనుకుంది షాజహాన్. మరుసటి వారానికి ఆగిన కుంపులతో సహ కలిపి కడుదామని నిశ్చయించుకొని వ్యాపారి కోసం వేచి చూసింది. ఇంతలో వచ్చిన వ్యాపారి ఆగిన వారాలకు వడ్డీ కట్టాలంటూ వ్యాపారి సదరు మహిళపై బలవంతపు వసూళ్లకు పూనుకున్నాడు. ఇలా కొన్నిచోట్ల ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలను తట్టుకోలేక అనేక మంది మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలూ అనేకం ఉన్నాయి. ఇలా ఫైనాన్స్ వ్యాపారులు ఆది, సోమ, మంగళవారాల పేరుతో అర్బన్ పరిధిలోని గ్రామాలను ఎంచుకొని పేదల అవసరాలకు డబ్బులు ఇచ్చి అధిక వడ్డీ లాగుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఖమ్మం అర్బన్ పరిధిలోని పాండురంగాపురం, అల్లిపురం, కొత్తగూడెం, అగ్రహారం, ఖానాపురం, పుట్టకోట, బల్లేపల్లి, గోపాలపురం, గొల్లగూడెం, వైఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారులు పాగా వేసి పేదల రక్తాన్ని పీల్చేస్తున్నారు. వీరికి వ్యాపారం నిర్వహించేందుకు ఎటువంటి లైసెన్సులు లేకున్నా చాటుమాటుగా గిరిగిరి వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజులుగా జిల్లా పోలీస్ బాస్ ప్రైవేటు ఫైనాన్స్‌లపై దృష్టి సారించిన విషయం విదితమే. అలాగే అర్బన్ పరిధిలోనూ రోజులు, వారాల దందా వ్యాపారులపై కూడా దృష్టి సారించి వీరి ఆగడాలకు చెక్ పెట్టాలని బాధితులుగా ఉన్న పలువురు పేదలు వేడుకొంటున్నారు.

## పలువురికి మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ




ఎర్రా అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, మే 16 : ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం విస్తతంగా పర్యటించారు. ఖమ్మంరూరల్ వెంకటగిరికి చెందిన మొర్రిమేకల రామసంగం కుమారుడు మోహన్ కృష్ణల గౌతమి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. 8వ డివిజన్ గోపాలపురం బీఆర్ఎస్ నాయకులు లాల్ సాహెబ్, కొర్ర లోకేష్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 27వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ చింతల ప్రసాద్ ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాస్‌నగర్ చిత్తలూరి నర్సయ్య ఇటీవల శస్త్రచికిత్స చేయిచుకొనగా వారి ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 29వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రా అప్పారావు భార్య కృష్ణవేణి ఇటీవల శస్త్రచికిత్స చేయిచుకొనగా వారి ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, మోతారపు శ్రావణి సుధాకర్, పసుమర్తి రామ్మోహన్, బిక్కసాని జశ్వంత్, దనాల శ్రీకాంత్, డోన్వాన్ రవి, తోట వీరభద్రం, పాలడుగు పాపారావు, పత్తిపాక రమేష్, దడాల రఘు, దండగల రాంబాబు, సిరిపురపు సుదర్శన్, గొల్లపుడి రాంప్రసాద్, మిట్టపల్లి రవి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్, ఖయ్యూం, పిన్ని కోటేశ్వరరావు, అశోక్, వీరేందర్, మోహన్, తిరుపతిరావు, మల్లేశం, పణి, సాగర్ పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

**బీఆర్ఎస్ మహిళా విభాగం నేత నిరోషా**




ఖమ్మం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నిరోషా

ఖమ్మం, మే 16 : అందాల పోటీల పేరుతో తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని విదేశీ మహిళల కాళ్ల ముందు తాకట్టు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా నేత ఉబ్బలపల్లి నిరోషా డిమాండ్ చేశారు. అందాల పోటీలకు వచ్చిన సుందరీమణుల కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించిన రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం నిరోషా ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్ములా వన్ కార్ రేసింగులు నిర్వహించి తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం చేసిన కేటీఆర్ వంటి వారిపై కుట్రపూరిత కేసులు పెడుతున్న ప్రభుత్వం అందాల పోటీల పేరుతో తెలంగాణా పరువు ప్రతిష్టలు మంట గలుపుతోందని విమర్శించారు. బ్రిటిష్ కాలంనాటి బానిసత్వపు పాలనను మళ్లీ పునరావృతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉందని చెప్పుకుంటున్న సీఎం హంగుఆర్భాటాలతో అందాల పోటీలు నిర్వహించడానికి ఉత్సాహం చూపడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు

## ఖమ్మంలో 4 లక్షల మొక్కలు నాటాలి

**నగర ఉద్యానవన అధికారి రాధిక**



సమావేశంలో మాట్లాడుతున్న రాధిక

ఖమ్మం, మే 16 : వన మహోత్సవం 2025-26లో భాగంగా ఖమ్మం నగరంలో నాలుగు లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఖమ్మం నగర హార్టికల్చర్ అధికారి రాధిక వార్డు సూపర్‌వైజర్లకు సూచించారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలో గార్డెన్ విభాగంలోని సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేకించి మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలు ఎక్కడున్నాయి? బల్క్ ప్లాంటేషన్(గుంపులుగా మొక్కల నాటింపు) చేయగలిగే ప్రాంతాలు ఎక్కడున్నాయి? అనే అంశాలపై చర్చించారు. ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచడంతో పాటు, హరితవనాల విస్తరణకు ఉపయోగం ఉంటుందన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ ఎన్నిక

ఖమ్మం అర్బన్, మే 16 : రాజ్యాంగ పరిరక్షణ వేదిక 4వ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం ఖమ్మం నగరం పాండురంగాపురంలో జరిగింది. సంస్థ ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలీ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ అక్బర్, ఖమర్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా యాసీన్‌ను నియమించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ నజీర్, జానీపాషా, మీరాజ్‌లను, సహాయ కార్యదర్శిగా షేక్ రఫీ, జాయింట్ సెక్రటరీగా రఫీలను నియమించారు. మరికొంతమందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## డీఐసీఎస్‌సీ ప్రాజెక్టు పైలెట్ జిల్లాగా ఖమ్మం



శిక్షణ పొందిన వారితో డీఆర్‌డీవో సన్యాసయ్య

మామిళ్లగూడెం, మే 16 : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న డిజిటల్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్(డీఐసీఎస్‌సీ) ప్రాజెక్ట్‌కు పైలెట్ జిల్లాగా ఖమ్మంను ఎంపిక చేసినట్లు డీఆర్‌డీవో సన్యాసయ్య తెలిపారు. ఈ ప్రాజెక్టులో 137మంది స్వయం సహాయ సంఘాల మహిళలు ఎంపికయ్యారన్నారు. సెర్ప్, సీఎస్‌సీ కలిసి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు మోడల్ సీఎస్‌సీ కేంద్రాలు స్థాపించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ కేంద్రాలు రాజీవ్ యువ వికాసం, డీఐసీఎస్‌సీ ద్వారా మంజూరవుతాయన్నారు. దీనిలో భాగంగా 70 మంది మహిళలకు ఆర్‌ఎస్‌ఈటీఐ సంస్థలో వ్యాపార శిక్షణ అందించామని నెల రోజులపాటు శిక్షణ పొందిన వారు శుక్రవారం కలెక్టరేట్‌లో ఉన్న డీఆర్‌డీఏలో కలిసి అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. శిక్షణ పొందిన మహిళలను అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐసీఎస్‌సీ రాష్ట్ర ఇన్‌చార్జి హరికృష్ణ కుమార్, సీఎస్‌సీ జిల్లా సమన్వకర్త ఫయాజ్, జిల్లా మేనేజర్ సురేష్, ఆర్‌ఎస్‌ఈటీఐ సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## చెరువును ఆక్రమించారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెనుబల్లి, మే 16: చెరువు లోతట్టు ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించారంటూ తహసీల్దార్ రమేష్‌కు రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని చౌడారం గ్రామంలో ఉన్న రేగులకుంట చెరువు ఆక్రమణకు గురి కావడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి వర్షాకాలంలో చెరువు అలుగు నుంచి నీరు వృథాగా పోతుందని ఫిర్యాదు చేశారు. చెరువును ఆక్రమించిన వారు ఉపాధిహామీ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకొని న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.